
సామాన్యుడి ఆయుధం
# తెలంగాణ ప్రభ
మంగళవారం, మే 28, 2024
డిజిటల్




# అందరిపై నిఘా

2 లో

## ఫోన్ ట్యాపింగ్‌లో వెలుగులోకి కీలక విషయాలు

- రేవంత్ రెడ్డి, బండి సంజయ్, ఈటల, ధర్మపురి అర్వింద్ సహా ఎందరిపైనో నిఘా
- వాంగ్మూలంలో ఎన్నో విషయాలు వెల్లడించిన రాధాకిషన్‌రావు
- నాడు బీఆర్ఎస్‌కు ఇబ్బందిగా మారిన వ్యక్తుల ఫోన్లపై నిఘా పెట్టినట్లు వెల్లడి
- మీడియా యజమానుల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు వెల్లడి





## తెలంగాణ రాష్ట్ర అధికార చిహ్నం ఖరారు


తెలంగాణ ప్రభ, (హైదరాబాద్) : తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖరారు చేశారు. ఎంపిక చేసిన దానిలో కొన్ని మార్పులను సూచించారు. గతంలో చిహ్నంలో చార్మినార్, కాకతీయ తోరణం ఉన్నాయి. అయితే రాచరికపు ముద్రకు బదులు ప్రజాస్వామ్యం, తెలంగాణ ఉద్యమం ప్రతిబింబించేలా ఉండాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఈ మేరకు రూపొందే చిహ్నాన్ని... జూన్ 2న ఆవిష్కరించనున్నారు. తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నం తుది మెరుగులు దిద్దుకుంటోంది. ప్రముఖ చిత్రకారుడు రుద్ర రాజేశం ఈ చిహ్నాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన నేతృత్వంలోని బృందంతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. దాదాపు 12 నమూనాలు రూపొందించగా... వాటిలోనే ఒక దానిని సీఎం రేవంత్ రెడ్డి ఖరారు చేశారు.

సామాన్యుడి ఆయుధం
తెలంగాణ ప్రభ
WANTED
సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయ గలననే నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి
'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక'
ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి
సెల్ : 99854 44342

సామాన్యుడి ఆయుధం తెలంగాణ ప్రభ

# అందరిపై నిఘా!

## ఫోన్ ట్యాపింగ్‌లో వెలుగులోకి కీలక విషయాలు



**తెలంగాణ ప్రభ, (హైదరాబాద్) :** ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అప్పటి బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సహా పలువురి ఫోన్లపై నిఘా పెట్టినట్లు మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు వాంగ్మూలం ఇచ్చారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనం సృష్టించింది. ఈ వ్యవహారంలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా రాధాకిషన్‌రావు వాంగ్మూలంలో కీలక అంశాలు వెల్లడించినట్లుగా తెలుస్తోంది. నాడు బీఆర్ఎస్‌కు ఇబ్బందిగా మారిన వ్యక్తుల ఫోన్లపై నిఘా పెట్టినట్లుగా రాధాకిషన్ రావు వెల్లడించారు. నాటి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేతో విభేదాలు ఉన్న శంభీపూర్ రాజుపై, కడియం శ్రీహరితో రాజయ్య విభేదాలపై నిఘా పెట్టినట్లుగా వెల్లడించారు. తాండూరు ఎమ్మెల్యేతో పట్నం మహేందర్‌రెడ్డికి ఉన్న విభేదాలపై, తీగల కృష్ణారెడ్డి మీద, తీన్మార్ మల్లన్న ఫోన్లను ట్యాప్ చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ నేత జానారెడ్డి తనయుడు రఘువీర్‌రెడ్డితో పాటు బీజేపీ నేతలు బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, వారి అనుచరుల ఫోన్లపై నిఘా పెట్టినట్లు తెలిపారు. మీడియా యజమానుల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు వాంగ్మూలంలో తెలిపారు. ఇంటర్నెట్ ప్రోటోకాల్ డేటా రికార్డులను ప్రణీత్‌రావు విశ్లేషించినట్లు తెలిపారు.



## నేడే ఎన్టీఆర్ 101వ జయంతి

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల కేంద్రంలోని మిర్జాపూర్ క్యాంప్ లో ఎన్.టి.ఆర్. రామారావు 101వ. జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామని కోటగిరి మీర్జాపూర్ క్యాంప్ కాలనీ వాసులు,ఎన్టీఆర్ అభిమానులు తెలిపారు. ఉదయం 10 గంటలకు జయంతి ఉత్సవాల సందర్భంగా ఎన్టీఆర్ చౌరస్తా వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎన్టీఆర్ కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని ప్రజలు ప్రతి ఒక్కరు వచ్చి ఎన్టీఆర్ జయంతి ఉత్సవాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.



## మృతిడి కుటుంబానికి ఆర్థికసాయం

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** పోతంగల్ మండలంలోని జల్లాపల్లి అభాధి గ్రామానికి చెందిన తారాచంద్ నాయక్ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు అదే గ్రామానికి చెందిన మాజీ మండల కోప్షన్ మెంబర్ ఏం.ఏ.హకీం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వారి కుటుంబ సభ్యులకు మాట్లాడుతూ ...నిరుపేద కుటుంబానికి చెందినవారు కావడంతో వారికి ఇల్లు లేకపోవడంతో నిరాశకు గురయ్యారు .వారి ఇంటి నిర్మాణం కొరకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో మాట్లాడి ఇల్లు మంజూరు కొరకు తన వంతు కృషి చేస్తానని భరోసా కల్పించారు. ఈదురు గాలులతో మూడు కుటుంబాల ఇంటి పైకప్పు రేకులు లేచిపోవడంతో వారికి తన వంతుగా ఇంటి మరమ్మతుల కోసం రూ.5000 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపిటీసీ రాములు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ధనరాజ్, రూప్ సింగ్,జైసింగ్,పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## సీనియర్ సిటిజన్స్ డిమాండ్లను పరిష్కరించాలి

**ఆల్ సీనియర్ సిటిజేన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్**

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీనియర్ సిటిజెన్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కోరుట్ల డివిజన్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ డీవిజన్ కార్యాలయంలో డివిజన్, మండల, గ్రామ ప్రతినిధులకు వయోవృద్ధుల సంరక్షణ చట్టం 2007 నియమావళి 2011 పై అవగాహన కల్పించారు. అనంతరం అసోసియేషన్ ముద్రించిన సీనియర్ సిటిజెన్స్ పిలుపు పుస్తకాలను హరి అశోక్ కుమార్ ఆవిష్కరించి సంఘ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా హరి అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చే గుర్తింపు పొందిన తమ అసోసియేషన్ సేవలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అభినందించారన్నారు. సీనియర్ సిటీజేన్స్ కోసం ప్రత్యేక సంక్షేమ శాఖ కేంద్రంలో, రాష్ట్రంలో ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధుల సమావేశ భవనం కోసం హైదరాబాద్‌లో 2ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించి, భవన నిర్మాణం కోసం రూ.10 కోట్ల నిధులు కేటాయించాలని, ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని,అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యసేవలు అందించాలన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో వృద్ధుల కోసం సమీకృత డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, టాస్కా కేంద్ర కార్యాలయంకు ప్రభుత్వ భవనం తగు సౌకర్యాలతో కేటాయించాలని,రైల్వే ఛార్జీల్లో వృద్ధులకు ఆపి వేసిన రాయితీలు పునరుద్దరించాలని, తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007లో ప్రతిపాదించిన సవరణ బిల్లు 2019ని కేంద్రంలో రాబోయే ప్రభుత్వం పార్లమెంట్ లో పెట్టి ఆమోదింప జేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సెలింగ్ అధికారి హన్మంత్ రెడ్డి, కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు, డివిజన్ కౌన్సెలింగ్ అధికారి పబ్బా శివానందం, కార్యదర్శి గంటేడి రాజ్ మోహన్, కోశాధికారి నల్ల లక్ష్మీ నారాయణ, ఉపాధ్యక్షుడు ఎం.డి.సైఫోద్దీన్, రాజయ్య, సాబితలి, లక్ష్మీకాంతం, గంగారాం, శ్రీరాములు, వెంకటేశ్వరరావు, వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.





## జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** భారత దేశ ప్రథమ ప్రధానమంత్రి నవభారత నిర్మాత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయనకు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు కోరుట్ల పట్టణంలోని కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్లో జరిగిన కార్యక్రమంలో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావుతో పాటు కోరుట్ల బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ, జగిత్యాల జిల్లా మైనారిటీ కాంగ్రెస్ కార్యదర్శి ఎండి రఫీ, మాజీ కేడీసీసీ డైరెక్టర్ నాగునూరి గంగాధర్ గౌడ్, నూతిపెల్లి రాజం, రిజ్వాన్ తదితరులు ఉన్నారు.



# తెలంగాణలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

- జారీ చేసిన వాతావరణ శాఖ
- రెమాల్ తుపాను ప్రభావంతో తెలంగాణలో ఈదురు గాలులు వీచే అవకాశం
- నేడు హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వర్షం కురువవచ్చునని తెలిపిన వాతావరణ శాఖ
- రెమాల్ ప్రభావంతో ఏపీలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం

**తెలంగాణ ప్రభ, (హైదరాబాద్) :** తెలంగాణలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రెమాల్ తుపాను ప్రభావంతో తెలంగాణలో ఈదురు గాలులు వీచే అవకాశముందని తెలిపింది. మంగళవారం నాడు హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వర్షం కురవవచ్చునని వెల్లడించింది. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, సూర్యాపేట, నల్గొండ, కామారెడ్డి, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్ తదితర జిల్లాల్లో వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. ఇవాళ తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. రెమాల్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

## బీడీ కార్మికులకు పెంచిన వేతనాలు

# మే నెల నుంచి అమలు

**ఏఐటీయూసీ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సుతారి రాములు**




**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** తెలంగాణ రాష్ట్రంలోని బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న 7 లక్షల మంది బీడీ కార్మికులకు వేతనాలు పెంచుతూ ఒప్పందం కుదిరిందని ఏఐటియుసి అనుబంధమైన తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు తెలిపారు. సోమవారం రోజున సి ప్రభాకర్ భవన్లో మాట్లాడుతూ గత రెండేళ్ల క్రితం జరిగిన బీడీ కార్మికుల వేతనాలు పెంపు కోసం బీడీ యజమానులతో చేసుకున్న ఒప్పందం గడువు గత ఏప్రిల్ నెలలో ముగియడంతో నూతన వేతన ఒప్పందం కొరకు చర్చలు హైదరాబాదులో ఈనెల 25న జరిగిందని ఆయన అన్నారు. కొత్త వేతన ఒప్పందం ప్రకారం బీడీ కార్మికులకు ఉన్న మూలవేతనంపై రూపాయలు 4.25 పైసలు పెరుగగా 1000 బీడీలకు మొత్తం కూలి 249రూపాయల 99 పైసలు చెల్లించబడుతుంది అలాగే నెలసరి ఉద్యోగులకు చెక్కర్స్లకు 1700 ప్యాకింగ్ కార్మికులకు నెలకు 3650 పెంచుతూ ఇరుపక్షాన మధ్య ఒప్పందం కుదిరింది. ఈ నూతన వేతన ఒప్పందం మే 1 2024 నుండి 30 మే 2026 వరకు ఉంటుందని తెలిపారు. తెలంగాణ బీడీ మ్యానుఫ్యాక్చర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు హితేంద్ర ఉపాధ్యాయ కార్యదర్శి ధర్మేంద్ గాంధీ దేశాయ్ బీడీ ప్రొడక్షన్ మేనేజర్ రస్మికాంత్ పటేల్ టెలిఫోన్ బీడీ జనరల్ మేనేజర్ రమన్ భాయ్ పటేల్ చార్ బాయ్ బీడీ పక్షాన ప్రభాకర్ పాల్గొన్నారు. బీడీ కార్మిక సంఘాల వైపున ఏఐటీయూసీ నుండి సుతారిరాములు బి గోవర్ధన్ ఎండి ముక్కరం ఐఎఫ్టియునుండి చింత భూమేశ్వర్,సిఐటియునుండి రమ గోపి బిఎంఎస్ నుండి సుధీర్ కుమార్ శ్రీనివాస్ లు ఇతర సంఘాల నేత కే ఎన్ స్వామి బాలరాజు హెచ్ఎంఎస్ నుండి మల్లేశం లు పాల్గొన్నారు.



## పాయల్ రాజ్‌పుత్

# క్రైమ్ థ్రిల్లర్ 'రక్షణ' రిలీజ్ డేట్ ఇదే!

'Rx100' .. 'మంగళవారం' వంటి సినిమాలతో తనదైన గుర్తింపును సంపాదించుకున్న హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్. ఆమె ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా..పవర్‌ఫుల్ ఇన్వెస్టిగేటివ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించిన క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'రక్షణ'. రోషన్, మానస్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా 'రక్షణ' చిత్రం మెప్పించనుంది. రీసెంట్‌గా విడుదలైన ఈ టీజర్‌కు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. హరిప్రియ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రణదీప్ ఠాకోర్ దర్శకత్వం వహిస్తూ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని జూన్ 7న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత ప్రణదీప్ ఠాకోర్ మాట్లాడుతూ 'రక్షణ' టీజర్‌కు చాలా మంచి స్పందన వస్తోంది. ఇదొక క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ మిస్టరీ డ్రామా. పాయల్ పవర్ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఒక పోలీస్ ఆఫీసర్ జీవితంలో జరిగిన ఘటన స్ఫూర్తితో రాసిన కథతో సినిమా రూపొందింది'అన్నారు.

